రంజాన్ వేళలు

బుధవారం	గురువారం
ఇఫ్తార్ : సా.6.31	సహర్ : ఉ.5.04

నరక శిక్షనుంచి రక్షణ కోసం ప్రతిరోజూ దువా చేయండి. ఎందుకంటే ఆ శిక్ష తప్పులు చేసినవారిని ఎన్నటికీ వీడనిది.





కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

బహిరంగ వేలం ద్వారానే పసుపు కొనుగోళ్లను చేపట్టాలి

- సాంగ్లీ మార్కెట్ ధరల ప్రకారం కొనుగోళ్లు చేయాలి
- సిండికేట్‌గా మారిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి
- ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్
- మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా

ఖిల్లా, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బహిరంగ వేలం ద్వారానే పసుపు కొనుగోళ్లు చేపట్టాలని, మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్ ధరల ప్రకారం రైతుల పసుపు కొనుగోళ్లు చేయాలని, సిండికేట్‌గా మారిన పసుపు కొనుగోలు వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పసుపును తక్కువ ధరలకు కొనుగోలు చేసి రైతులకు నష్టాలు తెస్తున్న వ్యాపారుల వైఖరిపై మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట రైతు సంఘం నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. పసుపునకు ధరలు రాకుండా కొనుగోలు చేసస్తున్న సిండికేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. సాంగ్లీ మార్కెట్‌లో ధర ఒక విధంగా ఉంటే నిజామాబాద్ మార్కెట్‌లో మరో విధంగా ఉందన్నారు. నాణ్యమైన పసుపునకు పదివేలు దాటని పరిస్థితి ఉందన్నారు. పసుపు పంట తొమ్మిది నెలలకు వస్తుందని అందుకు రైతు ఎకరానికి సుమారు లక్ష70వేల రూపాయలు వెచ్చిస్తున్నారన్నారు. మార్కెట్‌లో ధరలు మాత్రం తక్కువగా ఉండడం వల్ల రైతుకు నష్టాలు వస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈనామ్ విధానం వల్ల వ్యాపారులు కోడ్ చేసిన ధరలకే రైతులు అమ్మాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ విధానం వల్ల రైతుకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. వ్యాపారులు మాత్రం ఆన్‌లైన్ విధానాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడానికి సిండికేట్‌గా మారి వ్యవహరిస్తున్నారన్నారు. పసుపునకు మార్కెట్‌లో మద్దతు ధర 15వేలు ఇవ్వాలని, ప్రభుత్వం పసుపు క్వింటాకు వేయి బోనస్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు ఆకాశవాణిలో పదో తరగతి పరీక్షలపై డీఈవో ప్రసంగం

నిజామాబాద్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నిర్వాహణ, పరీక్షలు రాయబోతున్న విద్యార్థుల సన్నద్ధత, పలు కీలక అంశాలపై ఆకాశవాణిలో బుధవారం ఉదయం 7.50 గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ప్రసంగించనున్నారు. న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్ ద్వారా ఈ కార్యక్రమం ప్రసారమవుతుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమ ఉద్దేశాన్ని అవగాహన చేసుకొని విద్యార్థులకు సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.



● యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నమూనా

విద్యాలయాల చుట్టూ జిల్లా రాజకీయాలు!

- జిల్లాలో నవోదయ పాఠశాల ఏర్పాటుపై రచ్చ రచ్చ
- ఇంకా కొలిక్కిరాని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల స్థల ప్రతిపాదనలు
- పంతాలకు పోతున్న కాంగ్రెస్, బీజేపీ నేతలు
- ఉపయోగకరంగా లేని స్థలాలను ఎంపిక చేయొద్దని కోరుతున్న ప్రజలు

నిజామాబాద్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం విద్యాలయాల చుట్టూ రాజకీయం తిరుగుతోంది. జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన నవోదయ పాఠశాల ఏర్పాటు విషయంలో ఎంపీ అర్వింద్ ఇటీవల చేసిన కామెంట్లు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారాయి. జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నవోదయ పాఠశాలను బోధన్‌లోని నిజాంషుగర్ ఫ్యాక్టరీకి చెందిన స్థలాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపగా వాటిని ఢిల్లీ అధికారులు రిజెక్ట్ చేసినట్లు ఎంపీ అర్వింద్ వ్యాఖ్యానించారు. వారం రోజులుగా జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటుపై అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా పోటా పోటీగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎంపీ అర్వింద్‌ల దిష్టిబొమ్మలను దహనం చేసిన ఘటనలు జరిగాయి. జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ వద్ద 30 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని నవోదయ ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని ఎంపీ అర్వింద్ వ్యాఖ్యానించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సైతం జక్రాన్‌పల్లి వద్ద 30ఎకరాల స్థలం ఉందని కలిగోట్ స్థలం కంటే అన్ని విధాలుగా జక్రాన్‌పల్లి వద్ద ఉన్న స్థలం నవోదయ పాఠశాల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని కలెక్టర్ ద్వారా మళ్లీ ప్రతిపాదనలు పంపిస్తామని చెబుతున్నారు. కాంగ్రెస్ నాయకుల వల్లే నవోదయ ఏర్పాటు ఆరు నెలలు ఆలస్యం అవుతుందని వచ్చే విద్యాసంవత్సరం జిల్లాలో నవోదయ పాఠశాలను ప్రారంభించే అవకాశాలు లేవని ఎంపీ వ్యాఖ్యానించగా కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం ఎంపీ వ్యాఖ్యలకు దీటుగా సమాధానం ఇస్తున్నారు. రూ.200 కోట్లతో నిర్మించనున్న జవహర్ నవోదయ పాఠశాల స్థల వివాదం ఇంకా సద్దుమనగకముందే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల ఏర్పాటు విషయంలోనూ అదే పరిస్థితి నెలకొంది. జిల్లాలోని బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలలో మొదటి విడతగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలు మంజూరు కాగా ఇటీవలే ప్రభుత్వం అధికారికంగా ఒక్కో గురుకులానికి రూ.200 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈనేపథ్యంలో మూడు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల స్థల కేటాయింపు విషయంలోనూ రాజకీయ నాయకులకు, అధికారులకు మధ్య స్పష్టత లేకపోవడంతో వాటి నిర్మాణం కూడా ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఎన్నికలప్పుడే రాజకీయాలు ఆ తర్వాత అభివృద్ధియే తమ ఎజెండాగా చెప్పుకొని పార్టీల నేతలు జిల్లాకు మంజూరైన విద్యాలయాల విషయంలో రాజకీయాలు చేయడంపై ప్రజలు, విద్యావేత్తలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

జవహర్ నవోదయ ఎక్కడ..?

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ వద్ద జవహర్ నవోదయ పాఠశాల కొనసాగుతోంది. నూతన జిల్లాల ఏర్పాటు తర్వాత జిల్లాకు ఒక నవోదయ పాఠశాల ఉండాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం నవోదయ పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. ఈ మేరకు నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల, నిజామాబాద్‌లకు రెండు జవహర్ నవోదయ పాఠశాలలను మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్థల సేకరణ పూర్తయితే కేంద్రం నుంచి జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటుకు అనుమతి ఇస్తారు. జిల్లాలోని కలిగోట్ వద్ద సర్వే నెంబర్ 1063లో 30 ఎకరాల స్థలాన్ని ఎంపీ అర్వింద్ సూచించగా బోధన్‌లోని ఆచన్‌పల్లి వద్ద సర్వే నెంబర్ 690లో ఉన్న స్థలాన్ని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించడంతో కలెక్టర్ ఢిల్లీకి ప్రతిపాదనలు పంపించారు. ఢిల్లీ అధికారులు ఈ స్థలాలను పరిశీలించి బోధన్ స్థలం విషయంలో వివాదాలు ఉండటంతో పాటు కలిగోట్ స్థలానికి సరైన రవాణా సౌకర్యం లేని కారణంగా రిజెక్ట్ చేసినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన స్థలాన్ని ప్రతిపాదిస్తే వచ్చే విద్యాసంవత్సరం పాఠశాలను ప్రారంభించేందుకు జవహర్ నవోదయ విద్యాసమితి సిద్ధంగా ఉండగా స్థల వివాదం కారణంగా వచ్చే విద్యాసంవత్సరం పాఠశాలను ప్రారంభించే అవకాశాలు లేనట్లు తెలుస్తోంది. అందరికీ అందుబాటులో ఉండి రవాణా సౌకర్యం ఉన్న కలిగోట్ వద్ద ఏర్పాటు చేయాలని ఎంపీ అర్వింద్ ప్రతిపాదిస్తుండగా ఆ స్థలం కంటే ఇంకా అందుబాటులో ఉండే జక్రాన్‌పల్లి వద్ద ఉన్న స్థలంలో ఏర్పాటు చేయాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కలెక్టర్‌ను కోరినట్లు సమాచారం. ప్రతిష్ఠాత్మకమైన జవహర్ నవోదయ పాఠశాల జిల్లాకు మంజూరైతే స్థల వివాదంతో ఆ పాఠశాల ఏర్పాటు మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. అసలు నవోదయ పాఠశాల ఎక్కడ ఏర్పాటు చేస్తారోనన్న ఆసక్తి అందరిలోనూ ఉంది.

స్థల ప్రతిపాదనలోనూ అదే పరిస్థితి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూ.200 కోట్లతో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల స్థల ప్రతిపాదనల విషయంలో నవోదయ స్థల వివాదం లాగే ఇక్కడ కూడా స్థల కేటాయింపుల విషయంలో సందిగ్ధత నెలకొంది. జిల్లాలో బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలకు ఒక్కోయంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలు మంజూరు అయ్యాయి. ఒక్కో పాఠశాలను 25ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. కలెక్టర్ రెండు రోజుల క్రితం జిల్లాలోని పలు స్థలాలను పరిశీలించారు. ఆర్మూర్ నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను అంకాపూర్ శివారులోని సర్వే నెంబర్ 493/1లో నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ప్రతిపాదిస్తుండగా ఆర్మూర్ శివారులోని పిప్రి రోడ్డులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనక ప్రాంతంలో నిర్మించాలని అధికార పార్టీ నేతలు కోరుతున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ రూరల్‌కు సంబంధించి సుద్దులంలో ఏర్పాటు చేసేందుకు అనుకూలమైన స్థలాన్ని జిల్లా యంత్రాంగం గుర్తించినట్లు సమాచారం. బోధన్‌కు సంబంధించి నవీపేట మండలం ధర్మాపూర్, బోధన్ మండలం బెల్లాల్ గ్రామ శివారులోని మదుమలంచ డిగ్రీ కళాశాల స్థలంలో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని అధికార పార్టీ నేతలు ప్రతిపాదిస్తున్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు మంచి విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేయనున్న గురుకుల పాఠశాలల విషయంలో స్థల ప్రతిపాదనల విషయంలోనే అధికార, బీజేపీ నేతలు పంతాలకు పోతున్నారు. తొందరగా స్థల సేకరణ చేసి గురుకుల పాఠశాలల నిర్మాణంతో పాటు నవోదయ పాఠశాల నిర్మాణం చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. అందరికి ఆమోదయోగ్యమైన భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా విద్యాలయాలను నిర్మించాలే తప్ప.. పంతాలకు పోయి ఎవరికీ ఉపయోగకరంగా లేని స్థలాలను ఎంపిక చేయవద్దని ప్రజలు కోరుతున్నారు.



ఎండిన వరిపంటలో మేకల మేత

ఎండిన వరిపంటను చూపిస్తున్న రైతు సాంబార్ విఠల్

కర్షకుల కన్నీరు

- జిల్లాలో తగ్గుతున్న భూగర్భ జలాలు
- పొలాలకు అందని సాగునీరు
- పశువులకు మేతగా ఎండిన వరి పంటలు
- ఆందోళనలో జిల్లా రైతులు

ఇందల్వాయి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. వరిపంటలకు సాగునీరు అందక ఎండు ముఖం పట్టడంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పొట్టదశలో ఉన్న పంట చేతికందకుండా పోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఎండిన పంటను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. కాగా, పలు ప్రాంతాల్లో ఎండిన వరిపంటలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు మంగళవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

పాతాళంలోకి నీరు

జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటడంతో వ్యవసాయ బోరుబావుల్లోని నీరు పాతాళంలోకి పోయాయి. దీంతో పొట్టదశలో ఉన్న వరి పంటను కాపాడుకోవడానికి రైతన్నలు నానా తంటాలు పడుతున్నారు. అప్పులు చేసి కొత్తగా 500 ఫీట్ల లోతు బోర్లు వేసినా చుక్క నీరు పడక పంటలు ఎండిపోతున్నాయి. రైతులకు ఏమి చేయాలో తోచక చావే శరణ్యం అని రోదిస్తున్నారు. మరో పది రోజుల్లో పంట చేతికి వచ్చే సమయంలో నీరందక పంటలు ఎండిపోతుండటంతో రైతన్న తిప్పలు అంతా ఇంతా కాదు. కంటికి రెప్పలా కాపాడుతున్నా.. కళ్లముందే వరిపంట ఎండుతుండటంతో కన్నీరు మున్నీరు అవుతున్నారు. నిజామాబాద్ జిల్లాలోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎండుతున్న పంటలతో రైతుల కష్టాలు

ఇందల్వాయి మండలంలోని 13గ్రామాల్లో మొత్తం 13,200 ఎకరాల వరిపంటను రైతులు సాగు చేస్తున్నారు. మార్చి చివరిలో పంటలు చేతికి అందుతాయి. కానీ మార్చినెల ప్రారంభంలోనే ఎండలు దంచికొడుతుండటంతో ఇప్పటివరకు 245 ఎకరాల వరి పంట నీరం దక ఎండిపోయిందని ఇంకా ఈ సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన పత్తిపాకల రాజన్న తనకున్న ఆరు ఎకరాల భూమిలో వరిపంటను సాగు చేస్తున్నారు. ఉన్న బోర్లు ఎత్తివేయడంతో ఆరు ఎకరాల పొలం మొత్తం ఎండిపోయింది. దీంతో చేసేది ఏమీ లేక పశువులకు, గొర్రెలకు మేతగా ఉపయోగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన సాంబార్ విఠల్‌కు చెందిన 2 ఎకరాలు, అవుసుల ధర్మపురికి చెందిన 2 ఎకరాలు, సిర్నాపల్లి గ్రామానికి చెందిన బండి చిన్న బుచ్చన్న 1 ఎకరంన్నర, బొల్ల అశోక్ 1 ఎకరం, గౌరారం గ్రామానికి చెందిన మంగలి శ్రీనివాస్ 1 ఎకరం, కమ్మరి రాజు 1 ఎకరం ఎండిన వరి పంటలు పశువులకు అడ్డాగా మారింది. లక్షలు పెట్టి వేసిన వరి పంటలు కోసి పశువులకు మేతగా వేస్తున్నారు.

ఎండిన 240 ఎకరాలు

మండలంలో మొత్తం 13,200 ఎకరాల వరి పంటను రైతులు సాగు చేస్తుండటంతో మార్చి నెల ప్రారంభంలోనే 240 ఎకరాల వరిపంట పూర్తిగా ఎండిపోయిందని భూగర్భ జలాలు తగ్గిపోవడంతో వరిపంటలు ఇంకా ఎండిపోయే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఎండిన వరిపంటలను గుర్తించి రైతులకు నష్టపరిహారం అందించి ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

సాగునీటిపై రైతులకు అవగాహన కల్పించాలి : కలెక్టర్

ధర్పల్లి: సాగునీటిపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. మంగళవారం మండలంలో ఎండిపోయిన వరిపంటను కలెక్టర్ పరిశీలించారు. ధర్పల్లి, దుబ్బాక, రేకుల్‌పల్లి గ్రామాల్లోని పొలాలను ఆయన పరిశీలించారు. పంటలు ఎండడంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ఒన్నాజిపేట్, ధర్పల్లి, గోవింద్‌పల్లి, దుబ్బాక, రేకుల్‌పల్లి, కొటాల్‌పల్లి గ్రామాల్లో 207 ఎకరాల మేర పంటలు ఎండిపోయినట్లు వ్యవసాయ అధికారి వెంకటేశ్ కలెక్టర్‌కు వివరించారు. రబీలో మండలంలో 18,950 ఎకరాల్లో వరి పంట వేయగా ప్రస్తుతానికి 207 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఏవోలు శ్రీనివాస్‌రావు, వెంకటేశ్, తహసీల్దార్ మాలతి, ఏఈవో లక్ష్మిప్రసన్న ఉన్నారు.

సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామ పరిధిలో ఎండిపోతున్న వరి పంటలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు మంగళవారం పరిశీలించారు. శోభన్ రాజు అనే రైతుకు చెందిన వరి పైరు కొంత విస్తీర్ణంలో ఎండుముఖం పట్టడాన్ని గమనించిన కలెక్టర్ అందుకు గల కారణాలను వ్యవసాయ అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. కాగా, గత ఏడాది యాసంగిలో పంటల పరిస్థితి ఎలా ఉంది, ఏ రకం ధాన్యం సాగు చేశారనే వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. ఎండు ముఖం పడుతున్న పంటలకు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, తహసీల్దార్ రవీందర్ రావు, ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి నర్సయ్య ఉన్నారు.



సిరికొండ పెద్దవాల్గోట్‌లో వరి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్



గాలిలో కాల్పులు జరుపుతున్న పోలీసులు



గంగారాం(ఫైల్)

లిఫ్టు ప్రమాదంలో కమాండెంట్ మృతి

● నివాళి అర్పించిన అడిషనల్ డీజీ ● సుద్దులంలో విషాదఛాయలు

కోటగిరి, మార్చి11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లా కేంద్రంలో లిఫ్టు ప్రమాదంలో 17వ బెటాలియన్ కమాండెంట్ తోట గంగారాం(55)ప్రమాదవశాత్తు మృతి చెందడంతో జిల్లాలో కోటగిరి మండలం సుద్దులం గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన తోట గంగారాం అంచెలంచెలుగా ఎదిగా 17వ బెటాలియన్ కమాండెంట్‌గా సేవలందిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చిన వెళ్లిన గంగారాం అంతలోనే లిఫ్టు ప్రమాదంలో అనంత లోకాలకు చేరడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. స్నేహితుడి ఇంటికి వెళ్లిన గంగారాం లిఫ్టు ఎక్కే క్రమంలో మూడో ఫ్లోర్ నుంచి కిందకి జారిపడ్డారు. లిఫ్టు సైతం ఆయన మీద పడడంతో ప్రాణపాయ స్థితిలో ఉన్న గంగారాంను ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతి చెందారు. ఆయన మృతదేహన్ని సుద్దులం గ్రామానికి మధ్యాహ్నం తీసుకువచ్చారు. అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్ సుద్దులం గ్రామానికి చేరుకుని గంగారాం మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి ఘన నివాళి అర్పించారు. కమాండెంట్ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రయత్నం చేశారు. అనంతరం అధికారిక లాంచనాలతో అంతిమ యాత్ర నిర్వహించారు. పోలీసుల గౌరవ వందనంతో మూడు రౌండ్లు గాలిలో కాల్పులు జరిపి నివాళులు అర్పించారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. అంతిమ యాత్రలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, హైదరాబాద్‌లో స్థిరపడ్డ గంగారాంకు భార్య రేఖ, కొడుకు సతీష్‌కుమార్, ఇద్దరు కూతుళ్లు గౌతమి, మీనల్ ఉన్నారు.



గంగారాం మృతదేహానికి నివాళి అర్పిస్తున్న అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్

ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారుల చొరవ

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్)కు దరఖాస్తు చేసుకున్న వారు పూర్తిస్థాయి ఫీజు చెల్లించి ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు చొరవ చూపుతున్నారని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఈనెల 31 లోపు పూర్తిస్థాయి ఎల్ఆర్ఎస్ ఫీజుతో పాటు ప్రో-రాటా ఓపెన్ స్పేస్ చార్జీలను చెల్లించే వారికి ప్రభుత్వం 25శాతం రిబెట్ వర్తింపజేస్తుందని గుర్తుచేశారు. ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు రిబెట్ మినహాయిస్తూ వెంటనే ల్యాండ్ రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన ప్రొసిడింగ్స్ జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో 190 మంది ఎల్ఆర్ఎస్ ఫీజును చెల్లించి తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్నారని ఇందులో రిబెట్ ప్రకటించిన తర్వాత 65 మంది ఫీజు చెల్లించారని మంగళవారం ఒక్కరోజే 15 మంది తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకున్నారని అన్నారు. భీంగల్ మున్సిపాలిటీ పరిధిలో 26 మంది, బోధన్‌లో 104 మంది ఎల్ఆర్ఎస్ ఫీజును చెల్లించారని అన్నారు. నగర పాలక సంస్థ పరిధిలో ఇప్పటి వరకు 895 మంది ఫీజు చెల్లింపులు చేశారని ఎల్ఆర్ఎస్ కింద రూ.12కోట్ల 45 లక్షల రుసుము వసూలు అయ్యిందని వివరించారు. దరఖాస్తు దారుల సౌకర్యార్థం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయించామని దరఖాస్తుదారులు సంప్రదించాలన్నారు. చెరువులు, నీటి వనరులకు సమీపంలో కనీసం 200 మీటర్ల దూరంలో ఉన్న స్థలాలకు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అనుమతులు తప్పనిసరి అని కలెక్టర్ తెలిపారు. ఎల్ఆర్ఎస్ అర్హత లేని స్థలాలపై చెల్లించిన ఫీజులలో 90శాతం రిఫండ్ అవుతుందని 10శాతం ప్రాసెసింగ్ చార్జీల కింద తీసుకుంటామని స్థలాల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎల్ఆర్ఎస్ అనుమతులు లేని భూముల్లో ఎటువంటి రిజిస్ట్రేషన్లు, నిర్మాణాలకు అనుమతి ఇవ్వబోమని తెలిపారు.

ఎస్ఎస్ఆర్ పాఠశాలపై డీఈవోకు ఫిర్యాదు


డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న నందిపేట ప్రైవేట్ పాఠశాలల యజమానులు

నందిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐదు చేతుల పోచమ్మ ఆలయ సమీపంలో నిర్మిస్తున్న ఎస్ఎస్ఆర్ పాఠశాలపై మంగళవారం జిల్లా ట్రస్మా అధ్యక్షుడు రాస నిత్యానందం ఆధ్వర్యంలో నందిపేట ప్రైవేట్ పాఠశాల యజమానులు జిల్లా విద్యాధికారి అశోక్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. నందిపేట నుంచి శాపూర్ వెళ్లే రోడ్డులో ఎస్ఎస్ఆర్ పాఠశాల భవనాన్ని నిర్మిస్తున్నారని, నిర్మాణం పూర్తి కాకుండానే వచ్చే సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు, టీచర్ రిక్రూట్‌మెంట్లు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారని డీఈవోకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతే కాకుండా టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించారని, విద్యాహక్కును తుంగలో తొక్కారని తెలిపారు.ఈపాటికే అన్ని హంగులతో ఎస్ఎస్ ఆర్ భవన నిర్మాణాన్ని చేపట్టామని గ్రామాల్లో ప్రచారం మొదలు పెట్టారని పేర్కొన్నారు. నిబంధనలకు విద్దంగా కార్యక్రమా లు చేపడుతున్న ఎస్ఎస్ ఆర్ పాఠశాలపై చట్టరీత్యా చర్యలు తీసు కోవా లని డీఈవో అశోక్ కుమార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ట్ర స్మా రాష్ట్ర సం యుక్త కార్యదర్శి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోజూ రి అరుణ్, నందిపేట అధ్యక్షుడు చుక్కబొట్ల దేవన్న ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

ఆర్మూర్‌రూరల్, మార్చి11(ఆంధ్రజ్యోతి): బీసీ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ నిధులతో సహా రెగ్యులర్ నిధులను వెం టనే విడుదల చేయాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ.నర్సింహరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సుమారు రూ.4వేల కోట్లు పెండింగ్‌లో పెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినప్ప టికీ నిధులు మంజూరు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో అసెంబ్లీలో పెండింగ్, రెగ్యులర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేస్తామని సీఎం ప్రకటించారని, ఇంత వరకు చేయలేదని, వెంటనే నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు.

మోర్తాడ్‌లో మహిళ అదృశ్యం

మోర్తాడ్, మార్చి11(ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన ఐనర్ల గంగు 52ఏళ్ల మహిళ కనిపించడంలేదని ఎస్సై విక్రం తెలిపారు. మున్నూరుకాపు కులానికి చెందిన ఐనర్ల గంగు గత 15 రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని, ఆమె కొడుకు ఐనర్ల అశోక్ ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిదర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

ఎడపల్లి, మార్చి11(ఆంధ్రజ్యోతి):ఈ నెల9వ తేదీన జానకంపేట గ్రామం లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ టెస్టులో మద్యం తాగి వాహనం నడిపిన షేక్ అమీర్‌ను మంగళవారం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్‌క్లాస్ న్యాయాధికారి ముందు హాజరు పరుచగా న్యాయాధికారి శేషతల్పసాయి రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పుని ఇచ్చారని ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఎవరైనా మద్యంతాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

క్యాంప్ డ్రైవ్‌లో ఆరుగురు విద్యార్థుల ఎంపిక


క్యాంపస్ సెలక్షన్‌లో ఎంపికైన విద్యార్థులు

మాక్లూర్, మార్చి11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మానిక్‌భండార్ శివా రులో గల విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఎక్సలర్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్టు కంపెనీ హెచ్‌ఆర్ శిల్ప, అవినాష్, అధికారికంగా ప్రకటించారు. కళాశాలకు చెందిన శ్రేయ, సంధ్య, గుర్ప్రాన్, తరుణ్, హీర్షద్, సిద్ధార్థలు ఎంపిక కాగా కళాశాల ప్రిన్సిపాల్ అభినందనలు తెలుపుతూ వారు మరింత ముందుకు దూసుకువెళ్లాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందంలో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలి


నందిపేటలో ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న వినయ్‌రెడ్డి

నందిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ ఒక్కరు పని చేయాలని ఆర్మూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పొద్దుటూరి వినయ్ రెడ్డి కోరారు. మంగళవారం నందిపేట మండలంలోని సాయిబాబ గార్డెన్‌లో నందిపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనుల నిర్మాణంకు మంజూరైన నిధుల ప్రొసిడింగ్ కాపీలను ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, ఐలాపూర్ సొసైటీ చైర్మెన్ మీసాల సుదర్శన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, ఆర్మూర్ నియోజక వర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్, నాయకులు పిప్పెర సాయరెడ్డి, లోక హన్మాండ్లు, సిలిండర్ లింగం, గాదారి గోపి, దమ్మాయి శ్రీనివాస్, జి రాజేందర్, ఎడ్డిగారి నిఖిల్, ఇసూబ్, తధితరులు ఉన్నారు.

ఆర్మూర్‌రూరల్:ఆలూర్ మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన ఎస్‌డీఎఫ్, సీఆర్ఆర్ నిధుల ప్రొసీ డింగ్ కాపీలను పార్టీ నాయకులకు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్, నాయకులు చిన్నయ్య, దేగాం శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను పరిశీలించిన శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్

డొంకేశ్వర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండలంలోని నూత్‌పల్లి మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను మంగళవారం శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ సాకేత్‌కుమార్ సందర్శించారు. పాఠశాల నిర్వహణ విద్యాబోధన తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలలో భోజనం చేశారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ప్రిన్సిపాల్ తదితరులు ఉన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై అవగాహన

భీమ్‌గల్, మార్చి11(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గోపు గంగాధర్ ఆధ్వర్యంలో మంగళవారం ప్లాట్ల యాజమానులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముగ్గురు ఎల్ఆర్ఎస్‌ను చెల్లించారు. ఈ కార్యక్రమంలో ప్లాట్ల యాజమానులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి కాళ్లకు సంకెళ్లు


బేడీలతో ఉన్న నిందితుడు చీపురుతో స్టేషన్‌ను ఊడుస్తున్న దృశ్యం

- స్టేషన్‌ను చీపురుతో ఊడిపించిన వైనం
- బోధన్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకున్న ఘటన

బోధన్‌రూరల్,మార్చి11(ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్లీ పోలీసులుగా ఉండాల్సిన పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్న తీరు బోధన్‌లో చోటు చేసుకుంది. చోరీ కేసులో కాళ్లకు సంకేళ్లతో ఉన్న వ్యక్తితో చీపురుతో స్టేషన్‌ను ఊడిపించిన ఘటనతో పోలీసుల తీరు వివాదాస్పదమైంది. ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడి కాళ్లకు సంకెళ్లు వేసి స్టేషన్‌ను చీపురుతో ఊడిపించిన వైనం మంగళవారం ఉదయం బోధన్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. అక్కడే విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ నిందితుడిని చీపురుతో ఊడిపించాడని సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు కూడా ఘటనపై విచారణ చేపడుతున్నారు. ద్విచక్ర వాహనం చోరీ కేసులో బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని సోమవారం విచారణ కొరకు పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చారు. ద్విచక్ర వాహనాలు చోరీ ఒప్పుకోవడంతో సోమవారం రాత్రి పారిపోతాడేమోనని చెప్పి కాళ్లకు బేడీలు వేశారు. మంగళవారం ఉదయం నిద్ర లేచిన నిందితుడిని అక్కడ పరిసరాలను పరిశుభ్రం చేయాలని అక్కడే ఉన్న పోలీసులు ఆదేశించారు. దీంతో చీపురు పట్టుకుని కాళ్లకు బేడీలు ఉన్న నిందితుడు ఊడుస్తున్నాడు. ఉదయం పూట స్టేషన్‌కు వెళ్లి ప్రజలు సంకేళ్లతో ఉన్న వ్యక్తి ఊడిచే వీడియోలను వివిధ గ్రూపుల్లో వైరల్ చేశారు. దీంతో ఈ ఘటన వివాదానికి తెర లేపింది. ఫ్రెండ్లీగా ఉండాల్సిన పోలీసులు ఇలా చేయడం సరికాదని, బేడీలతో ఉన్న నిందితులతో పనులు చేయించడం ఏమిటని ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. స్టేషన్‌కు వచ్చే వారితో స్నేహబంధంగా ఉండాలే కాని ఇలా పనులు చేయించడం ఏమిటని పేర్కొంటున్నారు.

- ఘటనపై పూర్తి విచారణ చేపడుతున్నాం: బోధన్ ఏసీపీ శ్రీనివాస్

మంగళవారం ఉదయం బోధన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ చేపడుతున్నామన్నారు. అక్కడ సీసీ కెమెరా ఉందని దీని వల్ల ఎవరి తప్పిదమో తేలిపోతే పోలీసులు అయిన సరే వారిపై చట్టరీత్యా చర్యలు చేపడతామన్నారు. అక్కడ విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ నిందితుడికి పనులు చేయాలని చెప్పడం జరిగిందని కొందరు, అతనే నిద్ర లేచి పడుకున్న ప్రదేశాన్ని పరిశుభ్రం చేసుకుంటున్నాడని మరికొందరు ఇలా రెండు వాదనలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ఏదీ ఏమైనా సీసీ పుటేజీల ద్వారా పూర్తి విచారణ చేపడుతున్నామన్నారు. సీసీ పుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారణ చేపడతామన్నారు. పోలీసుల తప్పిదం అయితే పోలీసులు అని చూడకుండా వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. పోలీసులు స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలని పేర్కొన్నారు. నిందితులతో పనులు చేయించడం సరికాదని దీనిపై పూర్తి విచారణ చేపట్టి త్వరలోనే ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కోటగిరి,మార్చి11(ఆంధ్రజ్యోతి): కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరి మోహన్ రెడ్డి హాజరై మహిళ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మహిళలు అన్ని రంగాలలో రాణించడం హర్షించదగ్గ విషయమన్నారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని, వారిని గౌరవించడం మన విధి అని పేర్కొన్నారు. ఎక్కడైతే మహిళలు గౌరవించబడతారో అక్కడ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్, ఎంఈవో శ్రీనివాస్ రావు, ప్రధానోపాధ్యాయురాలు అలివేలు, పీఆర్‌టీయూ నాయకులు బర్ల సాయిలు, ఉదయ్ చందర్, గంగారాజు, సుధీర్, నరేష్, అర్షద్ హుస్సేన్, రవీందర్, కృష్ణ మోహన్, సుమన సుచిత్రవాణి, ఎండీ పాషా, రాజు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో అశోక్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిషన్, మండల అధ్యక్షులు భూమయ్య, ప్రధాన కార్యదర్శి శివకుమార్, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు రాధ, పెద్ద ఎత్తున మహిళ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.


అంక్సాపూర్‌లో మహిళ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

వేల్పూర్: వేల్పూర్ మండలం అంక్సాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పాఠశాల హెచ్ఎం మల్లిశ్వరీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాదరి అన్నపూర్ణ స్మారక ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రాజన్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మల్లిశ్వరీ, ఉపాధ్యాయులు రవిచందర్, సునీత, రఘునాథ్, శ్రీదేశి, శ్రీలక్ష్మీ, కాంతయ్య, రాజేందర్, దామోదర్‌గౌడ్, యమున, దేవరాజ్, వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పొతంగల్‌లో కొనసాగుతున్న నిరసన దీక్ష

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కోటగిరి,మార్చి11(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పోచీరాం డిమాండ్ చేశారు. పొతంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన నిరవధిక నిరసన దీక్ష మంగళవారంతో 3వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పోచీరాం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేస్తే 59ఉప కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు దీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు యాదవరావు, సాయిలు, సంజీవ్, నర్సింలు, మస్నాజీ, భూమయ్య, దత్తు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రెండవ రోజు రిలే నిరహర దీక్ష కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జీ మైలారం బాలు మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీని మరిచి గ్రూప్ -1 ఫలితాలను విడుదల చేయడం సుప్రీం కోర్టు ఎస్సీ రిజర్వేషన్‌కు అనుగుణంగా తీర్పు వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగ నియమకాలు చేపట్టడం మాదిగల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మైలారం రాము, నూత్‌పల్లి సంతోష్, మంగ్గారం రవి, ఇందిరపు రాజు, మంద సంజీవ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: చందూర్ మండలకేంద్రంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీరిజర్వేషన్ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు అన్ని ఉద్యోగ పరీక్షలను ఫలితాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరవధిక నిరసన దీక్షలు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్ చేసిన అభివృద్ధి ఏమిటి?

- ప్రశ్నించిన కాంగ్రెస్ నాయకులు

బోధన్‌రూరల్,మార్చి11(ఆంధ్రజ్యోతి): బోధన్ నియోజకవర్గంలో ఎంపీ ధర్మపురి అరవింద్ ఒక్క అభివృద్ధి పని అయిన చేశాడా అని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నించారు. మంగళవారం బోధన్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం నిధులతో ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తామని శిలాఫలకం చేసి సంవత్సరం గడిచిన ఇప్పటి వరకు బ్రిడ్జి పనులు ప్రారంభం కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, ఆదినారాయణ, హరికాంత్ చారి, అంకు దామోదర్ రెడ్డి, రాములు, తలారినవీన్, చిరంజీవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

బీబీపేట,మార్చి 11(ఆంధ్రజ్యోతి): బీబీపేట మండలంలోని శివారురాంరెడ్డిపల్లి గ్రామంలో ప్రత్యేక ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతంగా నిర్మించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పూర్ణచంద్రోదయకుమార్, ఎంపీఓ అబ్బాగౌడ్, గ్రామాల కార్యదర్శులురమేష్, వెంకటస్వామి,మాజీ సర్పంచ్‌ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో లోపం లేకుండా చూడాలి

బోధన్‌రూరల్,మార్చి11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోపం లేకుండా చూడాలని సీజీఆర్ఎస్ చైర్మన్ ఈ.నారాయణ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణ శివారులోని బెల్లాల్ సబ్ స్టేషన్‌లో వినియోగదారుల ఫిర్యాదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ ముక్తార్ హైమద్, రామకృష్ణ, కిషన్, రాజాగౌడ్, నాయిని కృష్ణ, శివాజీ, గణేష్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్కోరలో ఒకరి అదృశ్యం

వేల్పూర్, మార్చి11(ఆంధ్రజ్యోతి): లక్కోర గ్రామానికి చెందిన గడ్డం నరేష్ వ్యక్తి సోమవారం మధ్యాహ్నం నుంచి తప్పిపో యినట్టు ఎస్సై సంజీవ్ తెలిపారు. గడ్డం నరేష్ టిఫిన్ సెంటర్ నడిపించు కుంటున్నాడని, సోమవారం ఉదయం 10గంటల సమయంలో టిఫిన్ సెంటర్‌లో భార్యతో ఉండగా దోశ ఆడర్ వచ్చిందని చెప్పి డెలివరీ చేయడానికి తన బైక్‌పై గడ్డం నరేష్ వెళ్లాడు. మధ్యాహ్నం 1గంట అయిన ఇంటికి రాక పోవడంతో నరేష్ ఫోన్ స్విచ్ వచ్చిందని, తమ బంధువుల ఇంటికి వెళ్లివెతికిన ఆచూకీ లభించలేదని భార్య తెలిపింది.మంగళవారం భార్య లాస్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో దొంగ అరెస్టు

నందిపేట,మార్చి 11(ఆంధ్రజ్యోతి):నందిపేట మండలంలోని వెల్మల్ గ్రా మంలో ఇటీవల దొంగతనం జరిగిన కేసుకు సంబంధించి ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సుంకరి శ్రీనివాస్ అనే దొంగను మంగళ వారం అరెస్ట్ చేసి కోర్టుకు పంపినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఈ నెల 7వ తేదీనా వెల్మల్ గ్రామంలోని కుస్తాపురం శ్రీనివాస్ ఇంట్లో దొంగ త నం జరిగింది. ఆ కేసులో ఏ-2గా ఉన్న సుంకరి శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి ఆయ న నుంచి 100 గ్రాముల వెండి పట్టా గొలుసులు రికవరీ చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

టోర్నీ విజేతగా బాబాపూర్ జట్టు

భీమ్‌గల్‌రూరల్ మార్చి11(ఆంధ్రజ్యోతి): మండలంలో పురాణీపేట్ గ్రామంలో గత 15రోజులు నుంచి నిర్వహిస్తున్న కీర్తిశేషులు బోల్లాపల్లి రాజాగౌడ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్‌లో పురాణీపేట్, బాబాపూర్ జట్లు తలపడగా బాబాపూర్ జట్టు విజయం సాధించింది. అనంతరం విజేతలకు ట్రోఫీలతో పాటు ప్రైజ్‌మనీని టోర్నీనిర్వాహకులు చరణ్, అజయ్, గ్రామస్థులు అందించారు.

రెండు గ్రామాల మధ్య వివాదంపై చట్టపరంగా న్యాయం చేస్తాం

- జిల్లా అధికారి ఆంజనేయులు స్వామి


ప్రజలకు హెచ్చరిక చదివి వినిపిస్తున్న అధికారులు

మోస్రా,మార్చి11(ఆంధ్రజ్యోతి): చందూర్ మండలంలోని లక్ష్మీసాగర్ తండ, లక్మాపూర్ గ్రామాల మధ్య చెరువు నీటి విషయంపై ఇరు గ్రామాల మధ్య సోమవారం రాత్రి గొడవ జరగగా పోలీసులు వచ్చి ఇరు వర్గాలను శాంతిపర్చారు. మంగళవారం ఉదయం సంబంధిత అధికారులతో మాట్లాడుకోవాలని గొడవలతో సమస్యలు పరిష్కారం కావని సూచించారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో బాన్సువాడ, నిజామాబాద్ ప్రధాన రహదారిపై లక్మాపూర్ గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. మా నీళ్లు మాకు ఇవ్వాలని నినాదాలు చేశారు. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోగా ఏసీపీ శ్రీనివాస్ పోలీసు సిబ్బంది వచ్చి ధర్నా చేయడం ఇంతటి ఎండలో జనాలకు ఇబ్బంది పెట్టడం సరికాదని, చెరువు వద్దకే వెళ్లి సమస్య పరిశీలన చేసి పరిష్కారం చేద్దామని వెళ్లగా అక్కడికి చేరుకున్న జిల్లా మత్స్యశాఖ అధికారి ఇరు. గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ ఈ చెరువు మీ గ్రామానికి చట్టం ప్రకారం నమోదు చేసుకోలేరు గతంలో ఈ చెరువు మోస్రా మండలంలోని తిమ్మాపూర్ గ్రామం వారు చట్టం ప్రకారం నమోదు చేసుకుని చేపలు పెంచి వ్యాపారం చేసుకుంటున్నారు. ఇప్పుడు మీ రెండు గ్రామాలు వచ్చి మాకు వాటా ఉందంటూ గొడవలు చేయవద్దు మీ సమస్య పరిష్కారం నిమిత్తం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని సూచించారు. ఇప్పుడు ఈ చేపలను పట్టి వేలం వేసి వచ్చిన నగదు మొత్తం మండల శాఖ ఖాతాలో జమ చేసి సమస్య పరిష్కారం అనంతరం ఎవరి వాటా వారికి ఇస్తామని తెలిపారు. ఇంతలోనే జాలర్లు చేపలు పట్టుకుని ఒడ్డుకు తెచ్చిన వెంటనే ఒకేసారి అందరు చేపల వద్దకు చేరుకుని అధికారి మాటలు ధిక్కరించి చేపలు ఎత్తుకుపోయారు. మరికొన్ని చేపలు తెస్తుండగా పోలీసులు అప్రమత్తమై అందరిని చెదరగొట్టి ఒక్కొక్క చేపల మూటను వేలం వేశారు. జరిగిన పరిణామాలను ఖండిస్తూ ఇది గ్రామ ప్రజల గౌరవం పోగొట్టుకున్నట్లు చేస్తున్నారు. చేపలు లూటి చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, తహసీల్దార్ శాంత, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

ఎడపల్లి, మార్చి11(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని అంబం గ్రామానికి చెందిన కోతల ఒడ్డెన్న(49) అనే వ్యక్తి గ్రామ సమీపంలో ఉన్న పెద్దవాగులో మంగళవారం ఉదయం చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడి మరణించాడని, మృతుని కుమారుడు కోతల రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు.

సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్‌గా బోధన్ వాసి


వైల్ శ్రీనివాస్

బోధన్‌రూరల్,మార్చి11(ఆంధ్రజ్యోతి): సమ్మక్క, సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ మొదటి వైస్ చాన్సలర్‌గా బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌కు చెందిన వైఎల్ శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బోధన్ పట్టణానికి చెందిన వైఎల్ శ్రీనివాస్ విధినిర్వహణలో అంకిత భావంతో పని చేయడంతో ప్రభుత్వం గుర్తించి తనకు పదవి లభించిదని పట్టణ ప్రముఖులు ఈ సందర్భంగా ఆయనను అభినందిస్తున్నారు.

కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ


బాన్సువాడలో చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ సలహాదారులు పోచారం

బాన్సువాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణ కేంద్రంలోని తన ని వాసం వద్ద మంగళవారం వర్ని, చందూర్, కోటగిరి మండలాలకు చెందిన 82 లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ప్రభుత్వ సలహాదారులు పో చారం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కోటగిరి మండల మార్కెట్ కమిటీ అధ్యక్షులు గైక్వాడ్ హన్మంతు, కోటగిరి మండల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు అనిల్, వర్ని, చందూర్, కోటగిరి మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా పరీక్షల ప్యాడ్ల పంపిణీ

నందిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం1989-90 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పరీక్షల ప్యాడ్లు ఉచితంగా పంపిణి చేశారు. అంతే కాకుండా పెన్నులు, పెన్సిల్‌లు, రబ్బర్లు అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త ఏర్రం సిలిండర్ లింగం మాట్లాడుతూ విద్యలో ఉత్తమ ప్రతిభను కనభర్చే విద్యార్థులకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, 1989-90 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సాయిరాం,సుధాకర్, హన్మాండ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు

ధ్యానంతో మానసిక ప్రశాంతత

భీమ్‌గల్‌రూరల్ మార్చి11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతీరోజు యోగా, ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత పెరగడంతో పాటు జ్ఞాపకశక్తి పెరిగి మంచి మార్కులు పొందవచ్చునని యోగా గురుజీ పర్స అనంత్‌రావు తెలిపారు. మంగళవారం మండలంలోని దేవక్కపేట్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు యోగా కమిటీ బృందం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యోగ కమిటీ సభ్యులు శివకుమార్, నవీన్, రాకేష్, బాపురావు, పురస్తు లింబాద్రి, పాఠశాల హెచ్ఎం చిన్న రాజమణి, రేఖ, మోహన్, వీడీసీసభ్యులు అజయ్, సేవలాల్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి


ఏర్గట్లలో ఇంటి పన్నులు వసూలు చేస్తున్న జీపి సిబ్బంది

ఏర్గట్ల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరుగుతు న్న ఇంటి పన్నులు దుకాణాల లైసెన్స్‌లను మంగళవారం ఆర్మూర్ డీఎల్‌పీవో శివకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ నెల 25లోపు వందశాతం పన్నులు చెల్లిచాలని సిబ్బం దికి సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జాకీర్ హుస్సేన్, కారో బార్ సా యన్న, జీపి సిబ్బంది పాల్గొన్నారు.

భీమ్‌గల్‌రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని ఎంపీవో జావీద్‌అలీ కోరారు. మంగళవారం బాబాపూర్ గ్రామంలో ఎండ తీవ్రత ఎక్కువ కారణంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులు కలుగకుం డా చూడాలని కార్యదర్శి రమ్యకు ఆయన సూచించారు.గ్రామపంచాయతీలో రికార్డులను ఆయన పరిశీలించి పారిశుధ్య పనులకు ఖర్చు చేసిన వివరాలను అడిగితెలుసుకున్నారు.

బోధన్‌రూరల్: ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ అన్నారు. మంగళవారం పట్టణ గౌడ సంఘం, పాన్‌గల్లీ వారి వద్ద నుండి 2,68,768రూపాయల పన్నులను వసూలు చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

మిట్టాపూర్‌లో చిరుత సంచారం

నవీపేట,మార్చి11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టాపూర్ శివారులో చిరుత పులి సంచరిస్తుందని స్థానికులు తెలిపారు. మంగళవారం ఉదయం పొలం పనులకు వెళ్లిన పలువురు రైతులకు చిరుత పులితో పాటు రెండు చిరుత కూనలు తిరుగుతూ వారికి కనిపించాయని స్థానికులు పేర్కొన్నారు. చిరుత పులిని చూసిన వారు భయంతో గ్రామంలోకి వచ్చారని వారు వివరించారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానికులు పేర్కొన్నారు. గ్రామ శివారులో చిరుత పులి సంచరించడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యశాల

ఆర్మూర్‌టౌన్,మార్చి11(ఆంధ్రజ్యోతి):పట్టణంలో ప్రభుత్వ డిగ్రీకళాశా లలో వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జీఎస్టీ అంశంపై ఒక రోజు కార్యశాల నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వర్ష కోఆర్డినేటర్ జి.లింగన్న, కన్వీనర్ రాజ్ కుమార్, యు.మనోహర్, వైస్‌ప్రిన్సిపాల్ ఎం.సునీత, ఎస్.అంబర్‌సింగ్, జాన్ సుకుమార్, రహమన్, శ్యామ్‌కుమార్, వజీరబేగం, తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి కేజీబీవీ తనిఖీ

రామారెడ్డి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో ప్రభుత్వం కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను/హాస్టల్‌ను మంగళవారం మండల ప్రత్యేక అధికారి డాక్టర్ సంజయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్లేటి తిరుపతిరెడ్డి, కస్తూర్బా హాస్టల్ ప్రిన్సిపాల్ వనిత, పశువైద్యాధికారి రామచందర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

బోనాల్‌లో ఎల్లమ్మకు ఘనంగా బోనాలు

లింగంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలంలోని బోనాల్‌లో మంగళవారం ఎల్లమ్మకు ఘనంగా బోనాలను సమర్పించారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి ప్రతీ ఇంటి నుంచి బోనాలను తీసుకువెళ్లి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాన్ని చల్లగా చూడమని అమ్మవారిని ప్రార్థించారు. పల్గొన్నారు:' పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తాడ్వాయి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూకంటి వెంకట్‌రెడ్డి తెలిపారు.ఇందులో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అంబీర్, శ్యామ్‌రావు, మాజీ సర్పంచ్ బండారి సంజీవులు వీడీసీ చైర్మన్ మేకల రాజు, గ్రామ అధ్యక్షుడు మెట్టు చంద్రం, యూత్ ప్రెసిడెంట్ గుటగాడి రంజిత్‌రెడ్డి, ఈరా మొల్ల నర్సింలు, ఎరవటి శ్రీకాంత్, కాంగ్రెస్ కార్యకర్తలు, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రణాళికతో చదివితే..

పదిలో ఉత్తమ ఫలితాలు


విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు

ఆర్మూర్‌రూరల్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): మరో తొమ్మిది రోజుల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈ చివరి సమయం విద్యార్థులకు ఎంతో ముఖ్యమైనవని, ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు రాబట్టవచ్చని ఉపాధ్యాయులు చెప్తున్నారు. పదో తరగతి పరీక్షలు ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికతో చదవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు పదో తరగతి తొలిమెట్టు. ఇక్కడి నుంచే పిల్లల తల్లిదండ్రుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. పదవ తరగతిలో సాధించే మార్కుల ఆధారంగా విద్యార్థుల భవిష్యత్‌పై ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఈ పరిస్థితిని సులువుగా దాటలంటే పాఠ్యాంశాలపై పూర్తిఅవగాహన కలిగి ఉండడం ఉత్తమమని, సబ్జెక్టుల వారీగా ఏయే అంశాలలో ప్రాధాన్యత ఇవ్వాలి ప్రణాళికలను ఎలా సిద్ధం చేసుకోవాలో ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. విద్యార్థులకు పదవ తరగతిలో మంచి మార్కులు వచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది.

ఆంగ్లం సబ్జెక్టుపై భయాన్ని వీడాలి

విద్యార్థులు ఇంగ్లీష్ సబ్జెక్టుపై ఉన్న భయాన్ని వీడాలి. ప్రతీ పాఠ్యాంశాన్ని క్లుప్తంగా చదువుకుంటే చాలాసులువుగా మార్కులు సాధించవచ్చని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. కంప్రెహెన్సన్ సంబంధించి మూడు మార్కులు ఉంటాయి. వీటిపై అవగాహన కలిగి ఉంటే సులభమే. క్రియేటివ్, ఎక్స్‌ప్లెషన్‌కు 20 మార్కులు ఉంటాయి. లెటర్ రైటింగ్, సంభాషణలు, జీవిత చరిత్రలపై అవగాహన సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. మూడవ భాగంలో వ్యాఖరణం, పాఠ్యపుస్తకం చివరలో ఎక్సైజ్ అధారంగా ఎక్కువ ప్రశ్నాలు ఉంటాయి. పట్టుసాధిస్తే మార్కులు సాధిస్తారు. విషయ అన్ని అర్థం చేసుకొని చదివితే వందశాతం సాధించేందుకు వీలుంటుంది.

పతీ అంశంపై సాధన చేయాలి

భౌతికశాస్త్రంలో ప్రతీ అంశంపై విద్యార్థులు సాధన చేయాలి. రసాయన సమీకరణ పరమాణుల నిర్మాణం, మూలకల వర్గీకరణ, రసాయ బంధం అంశాలపై నాలుగు మార్కుల ప్రశ్నాలు ఎక్కువగా ఉంటాయి. క్రాంతికి సంబంధించి చిత్రలపై సాధన చేయాలి. విద్యుత్, కార్బన్ పాఠ్యంశాలపై రెండు మార్కుల ప్రశ్నలు ఉంటాయి. అందులోని పదాలను క్లుప్తంగా తెలుసుకోవడంతో బిట్లు ఎక్కువగా పూరించవచ్చు. ప్రయోగాలపై ముడిపెట్టి ప్రశ్నాలు ఉంటాయి. ప్రతీపాఠం వెనుక నేర్చుకున్న విషయంపై ఉన్న బిట్లను సాధన చేయాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

చివరి బీట్‌లపై సాధన చేయాలి

● జగదీశ్వర్, గణిత ఉపాధ్యాయులు, ఇస్సాపల్లి



గణితం మొదటి పేపర్‌లో వాస్తవ సంఖ్యలు, సమితులు, బహువదులు, సంఖ్యకశాస్త్రం, విరుపక రూపక రేఖగణితం పాఠ్యంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ముఖ్య పాఠ్యంశాలను కంఠస్తం చేస్తే అధిక మార్కులు సాధించవచ్చు. పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలి. గతంలో వచ్చిన ప్రశ్నాపత్రాలను గమనించాలి. అభ్యాసక దీపికను చదువుకుంటే మల్టిపుల్ చాయిస్‌లో ఎక్కువ మార్కులు సాధించవచ్చు. పరీక్షల్లో నేరుగా ప్రశ్నలు ఇవ్వకుండా మార్చిమార్చి ఇస్తారు. ఇష్టంగా లెక్కలు సాధన చేయడం వల్ల సోపన క్రమాన్ని అవగాహన చేసుకోవాలి. పాఠ్యంశం చివరన ఉన్న బిట్లపై పట్టుసాధిస్తే ఉత్తమ ఫలితాలు పొందవచ్చు.

చార్టు, బార్ డ్రాప్‌లపై దృష్టి సారించాలి

● కిషన్‌రెడ్డి, సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయులు



సాంఘీకశాస్త్రంలో భారత భౌగోళిక స్వరూపాలు, నీటి వనరులు, ఉత్పత్తులు, నదులు, గ్రామ ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, ఆహార భద్రత, ప్రపంచీకరణపై ప్రశ్నలు వస్తాయి. విద్యార్థులు చార్ట్, బార్ గ్రాఫ్‌లపై దృష్టిసారించాలి. చిత్రపటాలకు మార్కులు ఉంటాయి. నదులు, పర్వత శిఖరాలు, ప్రాజెక్టులు, పీట భూముల హద్దులను గుర్తించాల్సి ఉంటుంది. ప్రశ్నలకు జవాబులను విశ్లేశించి రాయాలి. పాఠ్యపుస్తకంలోని ప్రతీపాఠంలో ముఖ్యమైన అంశాలను అండర్‌లైన్ చేసుకోవాలి. మ్యాప్‌లో మహాసముద్రాలు, పర్వతాలు ముఖ్యదేశాల ప్రపంచ యుద్ధాలలో పాల్గొన్న దేశాల అంశాలపై అవగాహన ఉండాలి. ప్రశ్నలు పరోక్షంగా ఉంటాయి. చదివితే మార్కులు సాధించవచ్చు.

అన్నిఅంశాలపై అవగాహన పెంచుకోవాలి

● జిందం నరహరి, విశ్రాంత ఉపాధ్యాయుడు




జీవశాస్త్రంపై అవగాహన పెంచుకుంటే మంచి మార్కులు సాధించవచ్చు. మొదటి అంశం పోషనలో కిరణజన్య సంయోగక్రియా, శ్వాసక్రియలలో ఎక్కువ 4 మార్కులు వస్తుంటాయి. పోషకాహారలోపంతో వచ్చే వ్యాధులు విటమిన్‌లపై నాలుగు మార్కులు ప్రశ్నాలు ఉంటాయి. మైటోకండ్రియ విత్తనాలు, ఎలా శ్వాసక్రియ జరుపుతాయన్న ప్రతీ అంశాలు కూడా కీలకమే. ప్రసరణ పాఠ్యంశం నుంచి బ్లడ్ గ్రూప్‌లపై దృష్టి సారించాలి. జీవక్రియలో సమన్వయం, జీర్ణ మండలాన్ని మానవ శరీరంలో రెండో మెదడుగా ఎందుకు పరిగణిస్తారు. మెండల్ ప్రయోగాలు, పర్యావరణవనరులు, వ్యవసాయ పద్ధతులపై బాగా చదవాలి.



ఉపాధి పనులను చేస్తున్న కూలీలు

అరచేతిలో ఈజీఎస్ సమాచారం



జన్‌మన్ నరేగా ఈజీఎస్ యాప్

మద్నూర్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పారదర్శకతను పెంచేలా కేంద్ర ప్రభుత్వం నూతన యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉపాధిహామీ కూలీలకు అందుబాటులో ఉండేదా దీనిని రూపొందించారు. ఈ చట్టంలో ఎలాంటి అవకతవకలు లేకుండా పూర్తిగా పారదర్శకత ఉండేలా యాప్‌ను ఏర్పాటు చేశారు. జన్‌మన్ నరేగా పేరుతో వచ్చిన ఈ కొత్త యాప్ కూలీలకు సులభంగా సమాచారం అందేలా తీర్చిదిద్దారు. కూలీలు చేసిన పనులు యాప్‌లో అందుబాటులోకి రాగా ఉపాధి కూలీలకు యాప్ వరంగా మారనుంది.

● కూలీ వివరాలు ఉండేలా..

ఉపాధిహామీ కూలీలకు రెండు, మూడు బ్యాంకు ఖాతాలు ఉండడంతో ఏ ఖాతాలో కూలీ జమ అవుతున్నాయో తెలియని పరిస్థితి. వేతనాలు రావడం లేదని కూలీలు కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటారు. ఎంత పని చేశారు తెలియదని ఆందోళన చెందుతుంటారు. ఉపాధి హామీ సిబ్బంది రాసిందే పని వచ్చిందే కూలీ అన్న చందంగా ఉండేది. ఎంత పనిచేశారు.. ఏ రోజున పనిచేశారో తెలిసుకునేలా ఈ యాప్‌ను తీర్చిదిద్దారు. దీన్ని ద్వారా కూలీలకు అన్ని వివరాలు పూర్తిగా తెలుసుకునేందుకు ఉపయోగడనుంది. తద్వారా తమకు ఎంత వేతనం వస్తుందో ముందే కూలీలకు తెలుస్తుంది.

● సెల్‌ఫోన్‌లో డౌన్ లోడ్ చేసుకోండి ఇలా..

సెల్‌ఫోన్‌లోని ప్లే స్టోర్లో జన్ మన్ నరేగా అని టైపు చేయగానే యాప్ వివరాలు వస్తాయి. దాన్ని డౌన్లోడ్ చేసుకోవాలి. అందుబాటులో ఆరు రకాల ఆప్షన్‌లు ఉంటాయి. మొదటి ఆప్షన్ నొక్కగానే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, పంచాయతీ, గ్రామం, ఫ్యామిలీ ఐడీ వివరాలను సెలెక్ట్ చేసుకోవడంతో పూర్తి వివరాలు వస్తాయి. లేదా కూలీల ఉపాధిహామీ జాబ్ కార్డు నెంబర్ నమోదు చేయగానే కూలీకి సంబంధించిన వివరాలు కనిపిస్తాయి. జాబ్ కార్డులలో కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. అటెండెన్స్ ఆప్షన్ ఎంచుకోవడంతో ఏ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని రోజులు పనిచేశారు.. ఎన్ని రోజులు పని దినాలు మిగిలిపోయాయి అనే వివరాలు కనిపిస్తాయి. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకాచేయాల్సిన పనిదినాలు కనిపిస్తాయి. పేమెంట్ ఆప్షన్‌లోకి వెళ్లి వ్యక్తి పేరుమీద క్లిక్ చేయగానే ఎన్ని రోజులు ఎక్కడ పని చేశారు. కూలీ ఎంత ఎప్పుడు వారి ఖాతాలో జమచేశారు. ఏ బ్యాంకులో జమ చేశారని వివరాలు కనిపిస్తాయి. ఉపాధి హామీ డబ్బులు జమ కాకుంటే సదరు లబ్ధిదారుడి ఖాతాకు సంబంధించిన ఆధార్ బ్రిడ్జి పేమెంట్ సిస్టమ్ లింక్ అయిందో లేదో వివరాలు కనిపిస్తాయి. ఒకవేళ లింక్ అయితే పచ్చ రంగులో రైతు గుర్తు ఉంటుంది, లింకు కాకుంటే ఎరుపు రంగును తప్పు గుర్తు ఉంటుంది.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపొద్దు: వీసీ



టీయూలో మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ యాదగిరిరావు

డిచ్‌పల్లి, మార్చి11 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులపై వివక్ష చూపొద్దని, మానవదృకృథంతో సహాయం అందించి నైతిక మద్దతు ఇవ్వాలని టీయూ వైస్‌చాన్సలర్ ప్రొ.యాదగిరి రావు అన్నారు. మంగళవారం రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ స్థాయి రెడ్ రిబ్బన్ క్లబ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ యాదగిరిరావు హాజరై మాట్లాడారు. ఎయిడ్స్ గ్రస్తులపై వివక్షత చూపొద్దని, ఆరోగ్యకరమైన జీవనశైలిని బాధ్యత యుతంగా ప్రోత్సహించాలని అన్నారు. ప్రాణంతకరమైన ఈ వ్యాధిపై అవగహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. మురుగు వాడల్లో నివసించే ప్రజలకు దీనిపై ఎక్కువగా అవగహన కల్పించాలన్నారు. రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వాలు గతంలో విస్తరించిన క్షయను పూర్తిగా నేడు రూపుమాపాయని, అదే స్ఫూర్తితో ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త రవీందర్‌రెడ్డి, రాష్ట్ర ఎన్ఎస్ఎస్ సెల్ కార్యదర్శి నర్సింహగౌడ్, జిల్లా ఎయిడ్స్ ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్, ఆరోగ్య ఎడికేటర్ వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు. ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వీసీ, రిజిస్ట్రార్‌లు బహుమతులు అందజేశారు.



ఘనంగా ఎల్లమ్మతల్లి బోనాల ఊరేగింపు

డిచ్‌పల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మిట్టపల్లి గ్రామంలో రేణుకా ఎల్లమ్మ తల్లి ఉత్సవాలలో భాగంగా మంగళవారం మహిళలు, పెద్దఎత్తున్న బోనాల ఊరేగింపు నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి తీర్థప్రసాదాలు నైవేధ్యంగా సమర్పించారు. కార్యక్రమంలో గ్రామప్రజలు పాల్గొన్నారు.

వర్సిటీ పేరు మార్చితే మరో ఉద్యమం

● తెలంగాణ వర్సిటీ పేరు మార్పు ప్రతిపాదనలు వెనిక్కి తీసుకోవాలి
● టీయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేసిన పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ



టీయూ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు


టీయూ పేరు మార్చవద్దని రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

డిచ్‌పల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ పేరును మార్చితే ఉద్యమం తప్పదని పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి డా.కర్క గణేశ్, ఎస్ఎఫ్ఐ వర్సిటీ అధ్యక్షుడు శివా అన్నారు. ఎన్నో ఉద్యమాల ఫలితంగా తెలంగాణ యూనివర్సిటీ సాధించుకున్నమని ప్రభుత్వం పేరు మార్పు ప్రతిపాదనలు వెనిక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం టీయూ రిజిస్ట్రార్ యాదగిరికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణరాష్ట్రం పేరుతో ఉన్న యూనివర్సిటీపై రాజకీయలు చేయడం సరికాదని, కావున ఈ విషయంలో ప్రభుత్వం ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులు మరో ఉద్యమం చేస్తారని ప్రభుత్వానికి హెచ్చరించారు. దేశంలో చాలా రాష్ట్రాల్లో తమ రాష్ట్రాల పేరుతో యూనివర్సిటీల కొనసాగుతున్నాయన్నారు. అనంతరం పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు సతీశ్, మనోజ్, సంతోశ్, అజయ్ టీయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం పాల్గొన్నారు.

● పేరు మార్పునకు నిరసనగా ధర్నా

రాష్ట్రప్రభుత్వం టీయూ పేరు మార్చాలనే నిర్ణయం సరైందని కాదని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం వర్సిటీ కళాశాల ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఆందోళన కార్యక్రమంలో ప్రిన్స్, ఉస్సెన్, సాయి, కిరణ్, ఆకాశ్, రమ్య ప్రవీణ, రాజు, లావణ్య, సరిత, నిఖిల్, పాల్గొన్నారు.

భగీరథ నీరు.. వ్యవసాయానికి?

● భగీరథ నీటితో వ్యవసాయం
● నీటి కోసం ముడుపులు
● మంజీర ఉప నది వెంట మంజీరా తాగునీరు
● 50 ఎకరాలకు భగీరథ నీరే సాగు నీరు..
● దొంగతనంగా వాల్వ్ ఓపెన్


మంజీరా ఉప నదిలోనికి వదులుతున్న భగీరథ నీరు


వాల్వ్ ఓపెన్ చేయడంతో మంజీర ఉప నదుల్లోకి పైపు ద్వారా వెళ్లే పైప్‌లు ఇవే..

నిజాంసాగర్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ తాగునీటి పథకం నీటిని కాదు వ్యవసాయానికి వాడుకుంటున్న భగీరథ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. మిషన్ భగీరథ నిర్వహణ అధికారులు ముడుపులకు ఆశపడి ప్రధానలైన్‌లకు అనుసంధానం ఉన్న వాల్వ్ ద్వారా నీటిని వ్యవసాయానికి వినియోగించుకుంటున్నారు. దీంతో సింగూరు, జుక్కల్ మిషన్ భగీరథ పథకం కింద ఉన్న 785 హ్యాబిటేషన్లలో నీటికొరత ఏర్పడుతున్న అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. సింగూరు, జుక్కల్ మిషన్ భగీరథ పథకం ద్వారా పైప్‌లైన్లు వేసి తాగునీటిని 785 హాబిటేషన్లలోని ట్యాంకులకు నీటిని సరఫరా చేస్తుంటారు. నిజాంసాగర్ మండల పరిధిలోని ఎన్‌హెచ్ఏఐ 161 రహదారి నాగమడుగు వంతెన పక్కన మిషన్ భగీరథ పైప్‌లను వేశారు. ఈ పైప్‌లైన్లకు ప్రెషర్ వాల్వ్ ఏర్పాటు చేశారు. ఈ ప్రెషర్ వాల్వ్ ద్వారా ప్రతీరోజు అధికా రులు రాత్రివేళలో వాల్వ్‌ను విప్పి వ్యవ సాయానికి వదులుతున్నారు. మిషన్ భగీ రథ అధికారులకు 50 ఎకరాలలో సాగు చేసే రైతుల నుంచి రూ.వెయ్యి నుంచి 2వేల వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మిషన్‌భగీరథ, సింగూర్, జుక్కల్ ద్వారా బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి, బోధన్ నియోజకవర్గాల్లో 785 హాబిటేషన్లకు తాగునీరు అందిస్తుంది. నాగమడుగు మత్తడి సమీపంలో రాత్రివేళలో రైతులు ప్రెషర్ వాల్వ్ ద్వారా నీటిని ఇప్పి మంజీరా ఉప నదులలోనికి విడుదల చేసుకుంటున్నారు. ఈ నీటి ద్వారా దాదాపు నర్సింగరావుపల్లి, మాగి, వడ్డేపల్లి శివారులోని వ్యవసాయ భూములకు నీటిని వినియోగించుకుంటున్నారు. తరచుగా నల్లవాగు, ముత్తడి నర్సింగ్‌రావుపల్లి, కూడలిలో పైప్‌లైన్లు లీకేజీలు అవుతున్నామరమ్మతులు చేస్తున్న అధికారయంత్రం ప్రెషర్‌వాల్వ్ ద్వారా లీక్ అవుతున్న నీటిని అరికట్ట లేకపోవడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. వేసవిలో తాగునీటిని దృష్టిలో ఉంచుకుని మిషన్ భగీరథ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవం

వేల్పూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెల గ్రామంలో గంగాపుత్ర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం అంగరంగా వైభవంగా జరిగింది. శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయ 21వ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవాలు గత మూడు రోజుల నుంచి కొనసాగుతున్నాయి. అందులో భాగంగానే మంగళవారం ఉదయం లక్ష్మీనర్సింహస్వామికి అభిషేకం, వస్త్రాలంకరణ, మండపరాధన, హవనం, గంగజలాల అభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం వేద పండితులు రఘురమాచార్యులు, రాజగోపాలచార్యులు, ప్రణావ్‌చార్యుల మంత్రోచ్ఛరణాల మధ్య ఎదుర్కోలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధానవీధుల గుండా రథోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్త లు శ్రీలక్ష్మీనర్సింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చు కున్నారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘ సభ్యులు రాజగంగారాం, బలరాం, గంగామోహన్, చంటి మల్లయ్య, శంకర్, చిన్నరాజన్నతోపాటు మరికొంత మంది సభ్యులు పాల్గొన్నారు.

పసుపు విక్రయాలపై పకడ్బందీ పర్యవేక్షణ

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

అదనపు కలెక్టర్‌కు పర్యవేక్షణ బాధ్యతలు

నిజామాబాద్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులో పసుపు పంట విక్రయాలపై గట్టి పర్యవేక్షణ జరుపుతున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పసుపు పంట విక్రయాల సందర్భంగా రైతులకు ఏ దశలోనూ నష్టం వాటిల్లకుండా వారు మోసాలకు గురికాకుండా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. పసుపు క్రయ విక్రయాల నిశిత పరిశీలనపై సంబంధిత శాఖల అధికారులను అప్రమత్తం చేశామని క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా కృషి చేస్తామన్నారు. అధికారులతో పాటు అదనపు కలెక్టర్ కూడా పర్యవేక్షణ బాధ్యతలను నిర్వర్తిస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు.

పసుపు రైతుల బాధలు సీఎంకు పట్టవా?

● బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సుభాష్‌నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పసుపు రైతులను మోసం చేశాయని పసుపు రైతుల బాధలు, కష్టాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పట్టవా అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. పంటకు గిట్టుబాటు ధర కోసం పసుపు రైతులు చేపట్టిన ధర్నాపై మంగళవారం స్పందించారు. క్వింటాలు పసుపునకు రూ.15 వేల ధర కల్పిస్తామని ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ప్రస్తుతం పసుపునకు కనీసం రూ.9వేలు కూడా రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు బోర్డు తీసుకువచ్చామని చెబుతున్న బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ కనీసం రైతులను పరామర్శించడం లేదన్నారు.

తోట గంగారాం మృతికి సంతాపం..

తెలంగాణ సచివాలయం మాజీ సీఎస్‌వో జిల్లా వాస్తవ్యుడు తోట గంగారాం మృతి పట్ల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. సిరిసిల్ల బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేసిన తోట గంగారాం మృతి దిగ్భ్రాంతికరం అని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలియజేశారు.

వెల్నెస్ సెంటర్‌లో సేవలకు ఆటంకాలు

కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరుతున్న ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్ ప్రతినిధులు



వెల్నెస్ సెంటర్ వద్ద ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నగర పాలక సంస్థ కార్యాలయాల ప్రాంగణంలో ఉద్యోగ పెన్షనర్ల, జర్నలిస్టుల ఔట్‌పేషెంట్ సేవల కోసం ఏర్పాటు చేసిన వెల్నెస్ సెంటర్‌లో గత వారం రోజులుగా మందులు ఇచ్చేందుకు సరైన సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆల్‌పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు తెలిపారు. మంగళవారం వెల్నెస్ సెంటర్‌ను సందర్శించిన ఆయన ఓపీ సేవలు పూర్తిగా నిలిచిపోయాయని, ఫార్మసిస్టులు లేక మందులు ఇవ్వడం లేదని తెలిపారు. ఇంటర్నెట్ సేవలు లేవని, కరెంటు లేదని, సరిపడా ఫార్మసిస్టులు లేక పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. 25 మంది సిబ్బంది వెల్నెస్ సెంటర్‌లో ఉన్నా.. పరిస్థితి దారుణంగా ఉందని కామారెడ్డి, ఇతర దూర ప్రాంతాల నుంచి పెన్షనర్లు, సీనియర్ సిటీజన్లు వచ్చి ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ వెంటనే స్పందించి తక్షణమే ఫార్మసీ సిబ్బందిని అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు.

మెడికల్ కళాశాలను సందర్శించిన గిరిరాజ్ విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషనల్ టూర్‌లో భాగంగా నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించారు. కళాశాలకు చెందిన బయోటెక్నాలజీ, మైక్రోబయోలజీ, బయోకెమిస్ట్రీ విభాగాలకు చెందిన విద్యార్థులు ఈ టూర్‌లో పాల్గొన్నారు. మెడికల్ కళాశాలలోని డయాగ్నోస్టిక్ ల్యాబ్, వైరాలజీ సెంటర్, బ్యాక్టీరియాలజీ, ఈఎల్ఐఎస్ఏ, ఆర్‌టీపీసీఆర్, మైక్రోబయాలజీ కల్చర్‌చే విధానాలను కళాశాల మైక్రోబయోలజీ విభాగాధిపతి రమ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రసాద్, సాయిప్రణీత్‌లు విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో గిరిరాజ్ ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

మోపాల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు మండల అభివృద్ధి అధికారి రాములు నాయక్ మంగళవారం భూమి పూజ చేశారు. మండలంలోని ఆయా గ్రామాలలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని వివరించారు. మంజూరైన వారికి ఎంపీడీవో స్వయంగా దగ్గరుండి ముగ్గుపోసి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, వీడీసీ పెద్దలు పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):2025-26 విద్యాసంవత్సరానికి గాను మోడల్ స్కూళ్లలో 6, 7, 10వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు నిర్వహించే అడ్మిషన్ టెస్ట్ కొరకు దరఖాస్తుల గడువును ఈనెల 20 వరకు పొడగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలిపారు. ఏప్రిల్ 20న జరుగనున్న అడ్మిషన్ టెస్ట్ కొరకు ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఓసీ విద్యార్థులు రూ.200లు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యుఎస్ విద్యార్థులు రూ.125 చెల్లించి తెలంగాణఎంఎస్.సిజిజి.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. హాల్‌టికెట్లను ఏప్రిల్ 15వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రైవేటు పాఠశాల ఏర్పాటుకు అనుమతించొద్దని వినతి

నిజామాబాద్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):నందిపేట మండల కేంద్రంలో ఓ ప్రైవేటు పాఠశాల ఎలాంటి అనుమతులు లేకుండా అడ్మిషన్లు తీసుకుంటుందని కావున ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నందిపేట్, డొంకేశ్వర్ మండలాలకు చెందిన రికగ్నైజెడ్ స్కూల్స్ ప్రతినిధులు మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు చేయడంతో పాటు తమ పాఠశాలలో పనిచేస్తున్న టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను వారి పాఠశాలలో నియమించుకునే ప్రయత్నం చేస్తున్నారని కావున ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈవోను కలిసిన వారిలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, నందిపేట్, డొంకేశ్వర్ మండలాల అధ్యక్షుడు దేవన్న, నర్సింహరావు, అరుణ్, తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

నిజామాబాద్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):జిల్లా విద్యాశాఖ అధికారి కళ్లు తెరిపించాలని మంగళవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు నగరంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజలి, రఘురాం మాట్లాడుతూ నగరంలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే పెద్ద పెద్ద హోర్డింగ్‌లతో ప్రచారాలు నిర్వహిస్తూ విద్యార్థులను మోసం చేస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంజిత్, నవీన్, కృష్ణ, విఠల్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

● సమస్యను ప్రభుత్వం గుర్తించింది

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల



మాట్లాడుతున్న కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పసుపు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పసుపు కొనుగోళ్లకు ప్రత్యేక అధికారిని నియమించాలని కలెక్టర్‌కు తెలిపినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నుడా చైర్మన్ కేశవేణుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పసుపు రైతుల సమస్యను ప్రభుత్వం గుర్తించిందని ప్రత్యేక అధికారిని నియమించడం ద్వారా రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఎంపీ అర్వింద్ పసుపు బోర్డును తెచ్చానని గొప్పలు చెప్పుకుంటున్నారని నిజామాబాద్‌లో పసుపు పండిస్తే బోర్డును ఢిల్లీలో ఎందుకు ఏర్పాటు చేశారో జవాబు చెప్పాలన్నారు. జిల్లాకు చెందిన వ్యక్తే పసుపు బోర్డు చైర్మన్‌గా ఉన్నా పసుపు రైతులకు ధర మాత్రం పెరగడం లేదని రైతులకు అన్యాయం జరుగుతుంటే ఎంపీ అర్వింద్ ఎందుకు మాట్లాడటం లేదో జవాబు చెప్పాలన్నారు. గత సంవత్సరం పసుపు ధర పెరిగితే అది కేంద్ర ప్రభుత్వం పసుపు ఎగుమతులు చేయడం ద్వారానే పెరిగిందని చెప్పిన అర్వింద్ ఇప్పుడు పసుపు ధర తగ్గుతుంటే ఎందుకు మాట్లాడటం లేదన్నారు. సమావేశంలో నాయకులు రత్నాకర్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు రామర్తి గోపి, నరేందర్‌గౌడ్, సంతోష్, వేణురాజ్ పాల్గొన్నారు.

పసుపు రైతులకు నష్ట లేకుండా చూడాలి: మంత్రి తుమ్మల

నిజామాబాద్ అర్బన్ : పసుపు రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విషయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మంగళవారం జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి భవాణిశ్రీ, మార్కెటింగ్ డైరెక్టర్ సురేంద్రమోహన్, నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతులతో మాట్లాడారు. పసుపు రైతులు ఎవరూ నష్టపోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈనామ్ పోర్టల్‌లో పసుపు పంటకు వచ్చే గరిష్ట ధరను ఆధారంగా చేసుకొని నాణ్యతా ప్రమాణాలను మెరుగుపర్చడం ద్వారా రైతులకు న్యాయమైన ధర లభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

నేడు, రేపు యథావిధిగా తూకాలు..

మార్కెట్ యార్డులో బుధ, గురువారాల్లో పసుపు పంట తూకాలు యథావిధిగా కొనసాగుతాయని మార్కెట్ కమిటీ కార్యదర్శి అపర్ణ తెలిపారు. సోమ, మంగళవారాల్లో మార్కెట్‌కు పెద్దఎత్తున పసుపు పంట నిల్వలు వచ్చాయని తెలిపారు. బిడ్డింగ్ పూర్తయిన లాట్లకు బుధ, గురువారాల్లో తూకాలు జరుగుతాయని, మిగిలిన నిల్వలకు బిడ్డింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు.

ఆర్‌అండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే ధన్‌పాల్ సమీక్ష



ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):ఆర్‌అండ్‌బీ అధికారులతో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సమీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అర్బన్ క్యాంప్ కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ అధికారులతో పీయూఎఫ్ఐడీసీ కింద డివిజన్‌కు రూ.కోటి రూపాయల మంజూరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోటి రూపాయల నిధులు మంజూరైన నిధులు పెండింగ్ విషయంలో పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం ఇంచార్జి మంత్రి స్పందించి 2023 మార్చిలో పెండింగ్‌లో ఉన్న పీయుఎఫ్ఐడీసీలో 38 కోట్ల రూపాయలను కార్పొరేషన్‌లో డివిజనల అభివృద్ధికి మంజూరు చేయడం జరిగిందన్నారు. విడుదలైన నిధులను రోడ్లు, డ్రైనేజీ పనులు పాక్షికంగా, అసంపూర్తిగా జరిగిన పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారన్నారు. కాంట్రాక్టర్లు పనులు నాణ్యతతో చేపట్టాలని వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. అధికారులు, కాంట్రాక్టర్లు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. నగరంలో రోడ్ల మరమ్మతులు జరగడం లేదని గుంతలు పడిన రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ల గుంతలు వెంటనే పూడ్చాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీమాన్, నారాయణ, డీఈ ప్రవీణ్, మున్సిపల్ డీఈ రషీద్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఆడపడుచులకు అండగా సీఎం రేవంత్‌రెడ్డి: రూరల్ ఎమ్మెల్యే



చెక్కులు పంపిణీ చేస్తున్న నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆడపడుచులకు అండగా ఉన్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మోపాల్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వారికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపడుచులకు అండగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. పెళ్లైన ఆడపడుచులకు భారం పడకుండా ఉండేందుకు కల్యాణలక్ష్మీ,షాదీముబారక్ పథకం కింద రూ.లక్షా 16వేలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా సీఎం పనిచేస్తున్నారని అన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం జరిగే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, వీసీసీ డెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్, ఆయా గ్రామాలకు చెందిన నాయకులు కిరణ్‌రావుతో పాటు మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు చెం దిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను నిజా మాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పంపిణీ చేశారు. మంగళవారం నిజామాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జక్రాన్‌పల్లి మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన 34మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైడి చిన్నారెడ్డి, నిజామాబాద్‌రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, మాజీసర్పంచ్‌లు ఎం.కాట్‌పల్లి నర్సారెడ్డి, మాజీవైస్‌ఎంపీపీ జితేందర్ నాయక్, తహసీల్దార్ కిరణ్మాయి. ఆర్ఐ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తు ప్రభుత్వం ముందుకు వెళ్తుందని రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండలానికి చెందిన 37మంది లబ్ధిదారులకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోలసాని శ్రీనివాస్, కాంగ్రెస్ ప్రతినిధులు షాదుల్ల, రామకృష్ణ, సాగర్, సతీశ్ రెడ్డి, ఇబ్రహీంతో కలిసి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న సంక్షేమ పథకాలు ఆపడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు ధర్మగౌడ్, లింబాద్రి, పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళలంతా తమ వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ వారికి కేటాయించిన విధులను, కుటుంబ బాధ్యతలను సమన్వయం పర్చుకుంటూ ముందుకు వెళ్లడం గొప్ప విషయమని డీఎం అండ్ హెచ్‌వో రాజశ్రీ అన్నారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో డాక్టర్ నాగరాజు, ఏవో రాజేశ్వర్, సామ్రాట్ యాదవ్, సుప్రియ, వెంకటేశ్, నాగలక్ష్మి, పద్మ,పాల్గొన్నారు.

నిజామాబాద్ అర్బన్:అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జీఆర్ మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ, ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఎల్లమ్మగుట్ట మున్నూరుకాపు సంఘంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నిజామాబాద్ నార్త్ తహసీల్దార్ నాగార్జున, ఎన్‌సీడీసీఎల్ ఎస్ఈ రవీందర్, ప్రముఖ హైకోర్టు న్యాయవాది సరళా మహేందర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీఆర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు నరేష్, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ నిర్వాహకుడు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: సిరికొండ మండలం పెద్దవాల్గోట్‌లో పనిచేస్తున్నగ్రామ స్థాయి ఉద్యోగులను రిటైర్డ్ ఇంజనీర్ విద్యాసాగర్ మంగళవారం సన్మానించారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా పెద్దవాల్గోట్ గ్రామంలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగులు ఆరోగ్య,అంగన్‌వాడి,ఆశా కార్యకర్తలను సన్మాణించారు.

నిజామాబాద్ అర్బన్:అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారిణి రసూల్‌బీ తెలిపారు. జిల్లాస్థాయి అవార్డులకు ఎంపికైన మహిళలను సన్మానించడం జరుగుతుందని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని తెలిపారు.

ఇంటర్ పరీక్షల్లో ఒకరి డిబార్

నిజామాబాద్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఇంటర్మీడి యేట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళ వారం జిల్లా వ్యాప్తంగా ఇంటర్ మొదటి సంవత్సరం బోటనీ, పొలిటికల్ సైన్స్, మ్యాథ్స్ 1ఏ పరీక్షకు మొత్తం 21,218 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 20,366 మంది హాజరుకాగా 852 మంది గైర్హాజరయ్యారు. డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థిపై మాల్‌ప్రాక్టిస్ కేసు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా 57 పరీక్షా కేంద్రాలకు గాను 54 పరీక్షా కేంద్రాలను పరీక్షల నిర్వాహణ కమిటీ, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. డీఐఈవో రవికుమార్ 7 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ఎంఎస్‌పి చట్టాన్ని కేంద్రం చేసి అమలు చేయాలి

ఖిల్లా,మార్చి 11(ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎంఎస్‌పి చట్టాన్ని చేసి అమలు చేయాలని ఎస్‌కేఎం రాష్ట్ర నాయకులు, ఏఐయూకేఎస్ కేంద్ర నాయకులు వి.ప్రభాకర్ ఏ.పాపయ్యలు డిమాండ్ చేశారు. ఎస్‌కేఎం ఆధ్వర్యంలో మంగళవారం పాత కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంజర భూమయ్య, సురేష్, వెంకటేష్, సాయిరెడ్డి, బొంబాయి గంగారం, కే.గంగాధర్, బి.గంగారెడ్డి, జి.కిషన్, బి.కిషన్, టి.కృష్ణగౌడ్, ఎం. నాగేష్, ఆర్.దామోదర్, బి.బాబన్న, ఎం.నరేందర్, యూ. రాజన్న, బి.కిశోర్, అనిస్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవోదయ ఏర్పాటు విషయంలో ఎంపీ వ్యాఖ్యలు అర్థరహితం

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నవోదయ పాఠశాల ఏర్పాటు విషయంలో ఎంపీ అర్వింద్ చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితం అని రూరల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది మొదట తానేనని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం రూరల్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూరల్ నియోజకవర్గం కలిగోట్ వద్ద తాను ప్రతిపాదించిన స్థలాన్ని కాదని బోధన్‌లో ఏర్పాటు చేసేందుకు సుదర్శన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఇటీవల ఎంపీ చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. మొదట జక్రాన్‌పల్లి మండల కేంద్రానికి అర కిలోమీటరు దూరంలో ఉన్న అనువైన ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేయించి ప్రతిపాదించి తానేనని ఎమ్మెల్యే తెలిపారు. కలెక్టర్ ద్వారా మూడు సార్లు సర్వే చేయించానని కలిగోట్ వద్ద ఎంపీ అర్వింద్ ప్రతిపాదించిన స్థలం సరైన సౌకర్యాలు లేనందునే తిరస్కరణకు గురైందన్నారు. 2022లో కేంద్ర ప్రభుత్వం జిల్లాకు నవోదయను కేటాయిస్తే అది ఎందుకు కార్యరూపం దాల్చలేదో ఎంపీ సమాధానం చెప్పాలన్నారు. అప్పటి కలెక్టర్ ప్రతిపాదనలు సిద్ధం చేశారని ఆ ప్రతిపాదనలలోనూ బోధన్ స్థలం ఉందని ఆయన తెలిపారు. ఎంపీ అర్వింద్ కలిగోట్ వద్ద సూచించిన భూమి జాతీయ రహదారికి 12 కిలోమీటర్ల దూరంలో ఉందని సరైన రోడ్డు మార్గం కూడా లేదన్నారు. జక్రాన్‌పల్లి వద్ద తాను ప్రతిపాదిస్తున్న స్థలం అన్ని విధాలుగా నవోదయ ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందన్నారు. సీనియర్ నేతగా ప్రజాప్రతినిధిగా సుదర్శన్‌రెడ్డి బోధన్‌లో నవోదయ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయడంలో తప్పులేదన్నారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, సీనియర్ నాయకులు మునిపల్లి సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవోదయ పాఠశాలను రూరల్‌లోనే ఏర్పాటు చేయాలి

ధర్పల్లి: జిల్లాకు మంజూరైన నవోదయ పాఠశాలను రూరల్ నియోజకవర్గంలోనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఏబీవీపీ నాయకుడు హరీష్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని కలిగోట్ గ్రామంలో నవోద య పాఠశాల ఏర్పాటుకు ఎంపీ అర్వింద్ ప్రతిపాదించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డి సహకరించాలని లేఖ ద్వారా వివరించినట్లు హరీష్‌గౌడ్ పేర్కొన్నారు.

13న సీనియర్ పురుషుల హాకీ ఎంపికలు

సుభాష్‌నగర్,మార్చి11 (ఆంధ్రజ్యోతి):ఈనెల 13వ తేదీన సీనియర్ పురుషులహాకీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విశాఖ గంగారెడ్డి, సదమస్సు రమణలు తెలిపారు. ఈఎంపికలు ఆర్మూర్ పట్టణం లోని మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇందులో ప్రతిభ కనబ ర్చిన క్రీడాకారులను కరీంనగర్ జిల్లాలో జరిగే సీనియర్ పురు^షుల అంత ర్రాష్ట్ర పోటీలో పాల్గొంటారని తెలిపారు.ఈ ఎంపికలకు హాజర య్యే క్రీడాకారులు హాకీఇండియా ఐడీ నెంబర్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సుభాష్‌నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ మాదిగ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ చట్టం చేస్తానని చెబుతూ వర్గీకరణ లేకుండా పరీక్ష ఫలితాలు విడుదల చేయడమంటే మాదిగలను మోసం చేయడమేనన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యో గ ఫలి తాల విడుదలను విరమిం చుకొని ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగుల భర్తీ ప్రక్రియ చేపట్టాల న్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం అమలు తర్వాతే గ్రూప్-1, 2, 3 ఉద్యోగ ఫలి తా లు, నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో తెడ్డు గంగారాం, సుదర్శన్, నాగభూషణం,ప్రవీణ్,యమున, తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

నిజామాబాద్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):ఈనెల 13న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.ఈనెల 13న ఉదయం 10.30లకు జాబ్ మేళాకు హాజరుకావాల న్నారు. అభ్యర్థులు తమ రెజ్యూమ్, బయోడేటా, ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ మెమో, ఫోటోతో హాజరుకావాలని ఇతర వివరాలకు9948748428, 6305743423 నెంబర్లను సంప్రదించాలన్నారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.230	రూ. 250



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.88200	రూ.81400	రూ.1010

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : చావా (తెలుగు) (10.00)
: కింగ్‌స్టన్ (1.20, 7.40)
: చావా (హిందీ) (4.20)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (10.40)
స్క్రీన్-2 : సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (10.15)
: చావా (హిందీ) (1.30, 10.50)
: శివంగి (4.50)
: చావా (తెలుగు) (7.30)
స్క్రీన్-3 : రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (10.25)
: చావా (తెలుగు) (1.35)
: మిక్కీ17 (ఇంగ్లీష్) (4.55, 7.50)
: కింగ్‌స్టన్ (10.45)
స్క్రీన్-4 : నారీ (10.35)
: మిక్కీ17 (ఇంగ్లీష్) (1.10)
: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (4.05, 10.30)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (7.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1: జిగేల్ (11.00)
: కింగ్‌స్టన్ (1.30, 7.35)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (4.40, 10.25)
స్క్రీన్-2 : సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (1.30, 7.30)
: చావా (హిందీ) (4.35, 10.30)
స్క్రీన్-3 : చావా (తెలుగు) (11.00, 1.45, 4.40, 7.35, 10.30)

దేవి : మజాకా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : చావా (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్